# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 16-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ దేశంలోని చమురు శుద్ధి కర్మాగారాలు అన్నీ అత్యధిక సామర్ధ్యంతో పని చేస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

❖ అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలకు ఈరోజు నోటిఫికేషన్ విడుదలయ్యింది.

❖ హర్ముజ్ జలసంధి మీదుగా పయనించిన భారతీయ చమురు నౌక శివాలిక్ ఈ సాయంత్రం ముంద్రా పోర్ట్ కు సురక్షితంగా చేరుకుంది.

❖ 2025 సంవత్సరానికి గానూ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులను ప్రభుత్వం ప్రకటించింది.

==============================

దేశంలో ముడి చమురు కొరత లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశమంతటా ఇంధన సరఫరా సజావుగా సాగుతోందని పేర్కొంది. అంతర మంత్రిత్వ శాఖ ఈరోజు న్యూ ఢిల్లీలో నిర్వహించిన ఉమ్మడి పాత్రికయుల సమావేశంలో పెట్రోలియం సహజ వాయువు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ మాట్లాడుతూ... ముడి చమురు తగినంత పరిమాణంలో అందుబాటులో ఉందని చెప్పారు. చమురు శుద్ధి కర్మాగారాలు అన్నీ వాటి అత్యధిక సామర్ధ్యంతో పని చేస్తున్నాయని స్పష్టం చేశారు.

(వాయిస్ 20 సెకన్లు)

ఇక కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ మంత్రిత్వ శాఖ అధికారి రాజేశ్ కుమార్ సిన్హా మాట్లాడుతూ... భారతీయ చమురు నౌక శివాలిక్ హర్ముజ్ జలసంధి మీదుగా పయనించి దాదాపు 46 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ లోడ్ తో ఈ సాయంత్రం గుజరాత్ లోని ముంద్రా పోర్ట్ చేరుకుందని చెప్పారు. భారతీయ జెండా కలిగిన 22 నౌకలు పర్షియన్ గల్ఫ్‌లోని హర్ముజ్ జలసంధికి పశ్చిమాన ఉన్నాయని.. ఆ నౌకల్లో 611 మంది భారతీయ నావికులు ఉన్నారని వెల్లడించారు. మార్చి 14న యూఏఈ నుంచి బయలుదేరిన నౌక జాగ్ లడ్కి దాదాపు 81 వేల టన్నుల ముడి

చమురును మోసుకొస్తోందని తెలిపారు. ఆ నౌకలో ఉన్న భారతీయ నావికులందరూ సురక్షితంగా ఉన్నారని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంటు ఉభయ సభలు వారాంత విరామం అనంతరం ఈరోజు ఉదయం 11 గంటలకు తిరిగి సమావేశమయ్యాయి. ప్రశ్నోత్తరాలతో సభాపతి ఓం బిర్లా లోక్‌సభను ప్రారంభించారు. సభలో అనుబంధ ప్రశ్నలకు కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖా మంత్రి మన్సుఖ్ మాండవియా ఈ రోజు సమాధానమిస్తూ... దేశంలో స్వయం ఉపాధి పొందుతున్న వారు 2017-18లో 52 శాతం ఉండగా.. నేడు అది 58 శాతానికి పెరిగిందని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వృద్ధితో పాటు కార్మికుల ఆదాయం కూడా పెరుగుతోందని చెప్పారు. 2017-18లో 295 రూపాయలుగా ఉన్న శ్రామికుల సగటు రోజువారీ వేతనం.. ప్రస్తుతం 418 రూపాయలకి పెరిగిందని తెలిపారు. నూతన కార్మిక చట్టాల ప్రకారం కనీస వేతనం నిర్ణయించబడిందని, అన్ని రాష్ట్రాలు ఆ నిర్ణీత స్థాయి కంటే ఎక్కువ వేతనాలను చెల్లించాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు.

(వాయిస్ 28 సెకన్లు)

అదే విధంగా అనుబంధ ప్రశ్నలకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమాధానమిస్తూ... దేశ వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, మహిళా వ్యవస్థాపకులకు మరింత ప్రయోజనం చేకూర్చేందుకు పునరుద్ధరించిన స్టాండ్-అప్ ఇండియా పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించనుందని తెలిపారు. గత ఏడాది మార్చ్ తో గడువు ముగిసిన ఈ పథకాన్ని నీతిఆయోగ్, ఇతర విభాగాలు అధ్యయనం చేశాయని, లబ్దిదారులకు మరిన్ని ప్రయోజనాలను అందించడానికి దీనిని తిరిగి రూపొందిస్తున్నామని చెప్పారు. ఆ తరువాత రైల్వే మంత్రిత్వ శాఖ పరిధిలోని 2026-27 సంవత్సరానికి గ్రాంట్ల డిమాండ్లపై చర్చ చేపట్టారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అస్సోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలకు ఈ రోజు నోటిఫికేషన్ విడుదలయ్యింది. దీంతో ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని ఎన్నికల సంఘం ప్రకటించింది. అస్సోం, కేరళం, పుదుచ్చేరి, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఒకే దశలో జరగనుండగా.. పశ్చిమ బెంగాల్లో మాత్రం పోలింగ్ రెండు దశల్లో జరగనుంది. అస్సోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీలకు పోలింగ్ ఏప్రిల్ 9న జరుగనుండగా... తమిళనాడు, పశ్చిమ బెంగాల్లో తొలి విడత ఏప్రిల్ 23 తేదీన.. మలివిడత 29న నిర్వహించబడుతుంది. ఈ నాలుగు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు మే 4న జరుగుతుంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నడుమ ఇప్పటివరకు సుమారు 2 లక్షల 19 వేల మందికి పైగా భారతీయులు క్షేమంగా స్వదేశానికి చేరుకున్నారని పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు రాజ్యసభలో వెల్లడించారు. ఈరోజు అనుబంధ ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ... విమాన కార్యకలాపాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, గగనతలం అందుబాటులో ఉన్నప్పుడల్లా విమాన రాకపోకలు జరుగుతున్నాయని చెప్పారు. సంబంధిత దేశాల ఎయిర్ కంట్రోలర్స్ తో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. పశ్చిమాసియాలో గగనతలం ప్రతిష్టంభన కారణంగా భారతీయ విమానయాన సంస్థలు 4 వేల 300కు పైగా విమానాలను రద్దు చేశాయని రామ్మోహన్ నాయుడు తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

గ్రామీణ మౌలిక వసతుల కల్పనలో "జల్ జీవన్ మిషన్" గణనీయమైన పురోగతి సాధించిందని కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్ సభకు తెలియజేశారు. 2019లో ఈ పథకాన్ని ప్రారంభించేటప్పుడు కేవలం 3.23 కోట్ల గ్రామీణ కుటుంబాలకు మాత్రమే కుళాయి నీటి కనెక్షన్లు ఉండేవని.. నేడు అవి 15.83 కోట్లకు పెరిగాయని చెప్పారు. తదుపరి దశలో మరో 3 కోట్ల కనెక్షన్లను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని సి.ఆర్. పాటిల్ తెలిపారు.

==============================

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులను ప్రభుత్వం ప్రకటించింది. 2025 సంవత్సరానికి గానూ మొత్తం 24 భారతీయ భాషల్లోని ఉత్తమ రచనలకు గాను ఈ అవార్డులను ఖరారు చేసినట్లు కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ ఏడాది అవార్డు గెలుచుకున్న వాటిలో 8 కవితా సంకలనాలు, 4 నవలలు, 6 కథానికలు, 2 వ్యాస సంపుటాలు, ఒక సాహిత్య విమర్శ గ్రంథం, ఒక ఆత్మకథ, 2 జ్ఞాపకాలు (మెమోయిర్స్) ఉన్నాయని కేంద్ర సాహిత్య అకాడమీ పేర్కొంది. ప్రముఖ హిందీ రచయిత్రి మమతకలియా తన జ్ఞాపకాల సంకలనం "Jeete Jee Allahabad"కు గాను ఈ ఏడాది పురస్కారాన్ని అందుకున్నారు. దౌత్యవేత్త నవతేజ్ సర్నా తన ఆంగ్ల నవల "Crimson Spring"కు గాను సాహిత్య పురస్కారాన్ని దక్కించుకున్నారు. తెలుగు విభాగంలో ప్రముఖ కవి నందిని సిధారెడ్డి రచించిన "అనిమేష" కవితా సంపుటి ఈ పురస్కారానికి ఎంపికైంది. విజేతలకు ఈ నెల 31న న్యూఢిల్లీలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేయనున్నారు.

==============================

ఒడిశా కటక్ లోని ఎస్‌సీబీ వైద్య కళాశాల ఐసీయూలో ఈరోజు జరిగిన అగ్ని ప్రమాదంలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. ఐసీయూలోని ట్రామా కేర్ సెంటర్‌లో ఈ తెల్లవారుజామున చోటు చేసుకున్న ఈ అగ్ని ప్రమాదంలో 10 మంది రోగులు మరణించగా.. దాదాపు 11 మంది ఆసుపత్రి సిబ్బంది గాయపడ్డారు. ట్రామా కేర్ విభాగం మొదటి అంతస్తులో ఈ ఉదయం 3 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయని, షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంబవించిందని పోలీసులు తెలిపారు. ఘటనాస్థలిని సందర్శించిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ.. మృతుల కుటుంబాలకు 25 లక్షల రూపాయల నష్ట పరిహారం ప్రకటించి ప్రమాదంపై విచారణకు ఆదేశించారు. ఈ ప్రమాదంలో మరణించిన వారికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం తెలిపారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి 2 లక్షల రూపాయలు, గాయపడిన వారికి 50 వేల రూపాయలు పరిహారాన్ని ప్రధానమంత్రి ప్రకటించారు.

==============================
==============================